ANDHRA JYOTHI 21 SEP 2020
21 SEP 2020

## సామాజిక బాధ్యతతో మెలగాలి

### మంత్రి మల్లాడి కృష్ణారావు

యానాం, సెప్టెంబర్ 20: కరోనా వైరస్‌ను నియంత్రించడంలో ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. కరోనా వైరస్‌పై వ్యాపారుల్లో అవగాహన కలిగించేందుకు ఆయన చర్యలు చేపట్టారు. ఆదివారం ఆయన పుదుచ్చేరిలోని సారం మార్కెట్‌లోని పలు వ్యాపార సముదాయాల్లో వ్యాపారస్తులతో ఆయన మాట్లాడారు. పాటించాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు.

## యానాంలో 1487కు చేరిన కొవిడ్ కేసులు

యానాంలో కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 1487కు చేరుకుంది. ఆదివారం మరో 16 కేసులు నమోదయ్యాయి. వీరిని గుర్తించి అధికారులు ఐసోలేషన్ వార్డులకు తరలించారు. ప్రస్తుతం 216మంది ప్రభుత్వాస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుల్లోను, 117 మంది హోంఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. 1,118మంది కోలుకుని ఇళ్లకు తిరిగి వెళ్లారు. ఇప్పటివరకు 36మంది కొవిడ్‌తో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

యానాంకు చెందిన 57 ఏళ్ల వ్యక్తి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు ఈనెల 14న జీజీహెచ్‌కు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు నోడల్ అధికారి డాక్టర్ కిరణ్ తెలిపారు.

ENADU
21 SEP 2020

## స్పందనకు వందనం

**సమస్య:** యానాం ప్రభుత్వ ఆరోగ్యశాఖలో క్యాజువాలిటీలో ఉండే అత్యవసర టెలిఫోన్ నంబరు 0884 2321424 అనేక రోజులుగా పనిచేయడంలేదు. తక్షణమే దీనిని బాగుచేయించాలి.

– ఎల్.వెంకన్నబాబు, యానాం

**పరిష్కారం:** విషయాన్ని ఆసుపత్రి అధికారులతోపాటు బీఎస్ఎన్ఎల్ అధికారి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా టెలిఫోన్ లైన్ తనిఖీచేయించి పూర్తిస్థాయిలో బాగుచేశారు.

**- న్యూస్‌టుడే, యానాం**

**యానాం:** యానాంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పడుతోందని, ఆగస్టు నాటి తీవ్రత ఇపుడు లేదని పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తెలిపారు. యానాంలో ఆదివారం 16 పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు.

21 SEP 2020 SAKSHI

## యానాం నుంచి అక్రమంగా ఇసుక రవాణా



ఏపీకి చెందిన టైడల్‌లాకు ప్రాంతంలో ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్న యానాం వ్యక్తులు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి అర్ధరాత్రి ఇసుక అక్రమంగా తరలిస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి శనివారం అర్ధరాత్రి స్థానిక యానాం-ఆంధ్రా సరిహద్దులోని టైడల్‌లాకు ప్రాంతం వద్ద అధిక సంఖ్య లో నావలు గోదావరిలోని ఇసుకను తీసుకువచ్చి అనుమతి లేకుండా ర్యాంప్‌ను నిర్వహిస్తున్నాయని అనంతరం ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని పలువురు ఆరోపించారు. ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.ఆరు వేల వరకు అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ ఆదాయానికి యానాం నుంచి ఇసుక అక్రమ రవాణాతో గండిపడుతోందని పలువురు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరిహద్దుల్లో ఎన్ని చెక్ పోస్టులు పెట్టినా ఫలితం ఉండటం లేదన్నారు. టైడల్ లాకు వద్ద ఇసుక ర్యాంపులు నిర్వహించవద్దని ఏపీ హైకోర్టు ఆదేశాలిచ్చినా వాటిని బేఖాతర్ చేస్తున్నారన్నారు.

## కేశవవర్మకు చిత్రకళానిధి అవార్డు



అనాథల ఐక్యతను తెలియజేసే చిత్రం



కాకర్లపూడి కేశవవర్మ

యానాం: పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కాకర్లపూడి కేశవవర్మ గీసిన చిత్రానికి తిరుపతి ఆర్ట్స్ సొసైటీ అందించిన చిత్రకళానిధి అవార్డును ఆదివారం అందుకున్నారు. తిరుపతి కేంద్రంగా ఉన్న తిరుపతి ఆర్ట్స్ సొసైటీ (టీఏఎస్) ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్, స్కల్ప్చర్, కళంకారి, ఫోక్, ట్రెడిషనల్, మోడరన్ ఆర్ట్ తదితర అంశాల్లో నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్ అండ్ ఎగ్జిబిషన్-2020 నిర్వహించారు. అయితే మోడరన్ ఆర్ట్ విభాగంగా ఆయన గీసిన అనాథల ఐక్యతను తెలియజేసే చిత్రానికి చిత్రకళానిధి అవార్డును అందించారు. ఈ అవార్డును ఫిబ్రవరిలోనే ఇవ్వాల్సి ఉన్నప్పటికి కోవిడ్ నేపథ్యంలో వాయిదా పడిందని ప్రస్తుతం ఇచ్చారని అవార్డు గ్రహీత కేశవవర్మ తెలియజేశారు. ఇప్పటివరకు కేశవవర్మ తాను గీసిన చిత్రాలకు 60కి పైగా అవార్డులను సొంతం చేసుకున్నారు.

## ఏఎస్సై కుటుంబానికి డీఎస్పీ పరామర్శ



ఏఎస్సై మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ బాషా

యానాం, ఐ.పోలవరం: ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పీఎస్ ఎన్ మూర్తి (57) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో యానాంలో నివాసం ఉంటున్న ఆయన కుటుంబాన్ని అమలాపురం డీఎస్పీ షేక్ మాసూంబాషా ఆదివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో విశేష సేవలు అందించి మంచిపేరు సంపాదించుకున్న పీఎస్ఎన్ మూర్తి ఆకస్మిక మృతి తీవ్ర విచారకరమని ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అనంతరం పీఎస్ఎన్ మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐ.పోలవరం స్టేషన్ ఎస్సై రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖకు నివేదించాం

యానాం: పాఠశాలలు పునః ప్రారంభంపై నిర్ణయం తీసుకునేందుకు పుదుచ్చేరి విద్యాశాఖకు నివేదిక పంపినట్లు యానాం ప్రాంతీయ విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ ఆదివారం తెలిపారు. సరిహద్దు తూర్పు గోదావరి జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు తెరుస్తున్న నేపథ్యంలో యానాంలో పాఠశాలల ప్రారంభంపై 'సాక్షి'కి ఆయన వివరణ ఇచ్చారు. 9, 10 తరగతులకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకోలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన గైడ్‌లైన్స్‌ను, ప్రస్తుత పరిస్థితిని తెలిపే విధంగా నివేదికను పుదుచ్చేరి విద్యాశాఖ అధికారులకు పంపినట్లు తుది నిర్ణయం వారే తీసుకోవాల్సి వుందన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం ఉపాధ్యాయులు మాత్రం విధులకు హాజరవుతున్నారన్నారు.

21 SEP 2020 PRAJA SAKTHI

## నవోదయలో దరఖాస్తులు స్వీకరణ

యానాం : యానాంలోని జవహర్‌లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయంలో 2020-2021 ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోడానికి గడువు ఉన్నట్లు తెలిపారు. నవోదయ విద్యాలయ వెబ్‌సైట్ లింక్ www.navo-daya.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు ప్రస్తుతం యానాంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలని ఆమె పేర్కొన్నారు.